


నేటి దినపత్రిక
# సూర్య
ఉత్తరాంధ్ర
www.suryaa.com
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం
సోమవారం
13-1-2025
పేజీలు 6


## యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు

### కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు - నెహ్రూ యువ కేంద్రం, జెసిఐ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు




**శ్రీకాకుళం, జనవరి 12, మేజర్‌న్యూస్:**

భారతీయ సంస్కృతిని, హైందవ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద నేటి యువతకు స్ఫూర్తిదాయకుడని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని సూర్య మహల్ జంక్షన్ లో స్వామి వివేకానంద 162 వ జయంతి ఉత్సవాలను సెట్ శ్రీ, నెహ్రూ యువ కేంద్రం, జెసిఐ ఆధ్వర్యంలో, సింగపురంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ యువతే నవసమాజ నిర్మాతలని, దేశ భవిష్యత్తు యువత పైన ఆధారపడి ఉందని అన్నారు. దేశ భవిష్యత్తు యువత ఆలోచనలు, నడవడికతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. అవినీతి రహిత సమాజ స్థాపన యువత చేతుల్లోనే ఉందన్నారు. ప్రపంచ చరిత్రలో అత్యంత గొప్ప సాధువు తత్వవేత్త స్వామి వివేకనందని కొనియాడారు‘ 1893లో అమెరికా దేశం చికాగోలోని ప్రపంచ మత పెద్దల సదస్సులో ఆయన ప్రసంగం ద్వారా ప్రపంచమే ఆశ్చర్యపోయేలా చారిత్రాత్మక సందేశం ఇచ్చారన్నారు. స్వామి వివేకానంద గొప్ప మానవతావాదిగా హైందవ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసే మహెూన్నత వ్యక్తిగా ఆయన కొనియాడారు. నేటి యువత బట్టీచదువులు, నైపుణ్యం లేని నవతరాన్ని తయారుచేసి నిరుద్యోగాన్ని పెంచుతున్నాయన్నారు. స్వామి వివేకానందుని బోధనలు నైతిక విలువలను పెంచి మనోబలాన్ని, బుద్ధిని వికసింపజేసి స్వ శక్తిపై నమ్మకం పెంచే విద్య దేశానికి ఎంతో ఆవస్యకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వివేకనందున ఆలోచనలు బోధనలు దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో తీసుకు వెళ్తున్నారని భారతదేశం వివేకానందుని బోధనలను యువత ముందు తీసుకెళ్లడంలో శతశాతం విజయవంతం అవుతున్నారని అన్నారు. స్వామి వివేకానందుని బోధనలు చదివితే ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరవం పెంపొందుతుందని చెప్పారు. యువత చిన్న చిన్న సమస్యలకి మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యల బారిన పడుతున్నారని, వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మిగతా 2లో

## సంక్రాంతి సంబరాలకు ముస్తాబైన సింహగిరి

**విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్**



ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం సంక్రాంతి సంబరాలకు ముస్తాబైంది. తెలుగు లోగిళ్ళలో ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి వేడుకను అంగరంగ వైభవంగా జరిపించడానికి సింహగిరి సింగారించుకుంది. ఈఓ వి.త్రినాద రావు నేతృత్వంలో అధికార యంత్రాంగం సంబరాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. పల్లెను తలపించేలా గుడిసెలు, మట్టి పొయ్యిలు, ధాన్యపురా సులు, ముత్యాల ముగ్గులు, చెరుకు గడలు, ఎద్దుల బండ్లు, దేశీయ గోవులు, తీసుకువస్తున్నారు. మామిడి తోరణాలు, భోగి మంటల కోసం సన్నాహాలు చేస్తు న్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆదివా రం సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు ఆలయ మహా ద్వారం ఎదురుగా ముగ్గులు వేయా ల్సి ఉంటుందని అధికారులు ప్రక టించారు. భోగి పండుగ రోజున ఉద యం 9 గంటలకు చిన్నారులకు భోగి పళ్ళు వేడుక నిర్వహిస్తామన్నారు. కనుమ పండుగ రోజున శ్రీ కృష్ణాపురం గోశాలలో గో పూజలు జరిపిస్తామని తెలిపారు.

# భోగి పండుగ కోసం ఊరంతా ముస్తాబు

### అర్ధరాత్రి నుంచే మంటల కోసం కట్టెలు సిద్ధం -చలి స్నానాలకు ఏర్పాట్లు - గ్రామాలకు తరలిపోయిన పట్టణ జనం

**విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్**



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సంక్రాంతి పండుగ రానే వచ్చింది. దీంతో సోమవారం భోగి పండుగ కోసం ఊరంతా ముస్తాబు అయ్యింది. ఎక్కడ చూసినా భోగి పండుగ వేళ మంటలు వేసేందుకు రాత్రి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. పాత వస్తువులను ఈ మంటల్లో వేయడం సాంప్రదాయమే అయినా ఈ మంటల కోసం కట్టెలు తెచ్చేందుకు యువత ఉవ్విళ్లూరు తున్నారు. పాత సామాన్లను పెద్ద ఎత్తున పోగేయడం ఒక ఎత్తయితే మరో పక్క కట్టెలు, పాత చెక్కలను మంటల్లో వేసేందుకు ఆయా వీధి కమిటీలు సమాయత్తమవుతున్నాయి. ఆ మంటల్లోనే వేడి నీళ్లు కాసుకునేందుకు సైతం సిద్ధపడు తున్నారు. అయితే శనివారం నుంచీ ప్రభుత్వ కార్యాలయాలకు, స్కూళ్లకు సెలవులు ఇచ్చేయడంతో నగర వాసులు సగానికి సగం పైగా గ్రామీణ ప్రాంతాలకు తరలిపోయారు. మిగిలిన వారు నగరంలో సందడి చేస్తూ సంక్రాంతి హడావిడి చేస్తున్నారు. రైళ్లు, బస్సులు, సొంత వాహనాలు పూర్తిగా ప్రయాణీకులతో కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. బస్సుల్లో సీట్లు దొరక్క అనేక మంది బైకుల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నారంటే పరిస్థితి ఊహించుకోవచ్చు.

**ఆదివారం పండుగ బజార్...!**

పండుగ బజార్ గత కొద్ది రోజులుగా కొనసాగుతున్నప్పటికీ ఆదివారం మాత్రం భారీ ఎత్తున అమ్మకాలు జరిగినట్టు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పండుగ రోజు అంటూ నగర వ్యాప్తంగా వస్త్రాల వ్యాపారాలు రోడ్లపై సైతం పెద్ద ఎత్తున దుకాణాలు పెట్టేసారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వారంతా వస్త్ర ఆభరణాల కోసం నగరానికి వేలాదిగా చేరుకుని పండుగ బజార్ చేసేశారు. నగరంలో పేరొందిన మాల్స్ అన్నీ కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయాయి. ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళం, విజయగనరం, పార్వతీపురం, పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి, అరుకు ప్రాంతాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు కూడా విశాఖకు తరలివచ్చి వస్త్రాలను కొనుగోలు చేసినట్టు వస్త్ర వ్యాపారాలు చెబుతున్నారు.

## టీడీపీ ఆఫీస్‌లో సంక్రాంతి సంబరాలు



**విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్:**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. భోగిమంటలతో ప్రారంభించి బూరెలు మిఠాయిలు పంపిణీ చేశారు. తెలుగువారి సాంప్రదాయ దుస్తులతో రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అని, అటువంటి పండుగను జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు భోగ భాగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు , దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ సీతం రాజు సుధాకర్, ఉత్తర నియోజకవర్గం నాయకులు వెల్లంకి శ్రీ భరత్ , కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, టిడిపి నాయకులు పొడుగు కుమార్ ,నక్క కనకరాజు వలిశెట్టి తాతాజీ బంటుపల్లి సూర్యనారాయణ , ఉరుకుటి గణేష్, నమ్మి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన హెూంమంత్రి అనిత



**విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్:**

ఆపదలో ఉన్న వారిని చూసి హెూదా పక్కన పెట్టి మరీ మానవత్వం చూపించారు రాష్ట్ర హెూం మంత్రి అనిత. విశాఖ గాజువాక జంక్షన్‌లో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. బైకును ఢీకొట్టింది. అదే సమయంలో అటుగా వెళుతున్న హెూంమంత్రి అనిత గారు ప్రమాదాన్ని చూసి వెంటనే కాన్వాయ్ ఆపి ప్రమాద స్థలిని పరిశీలించారు. ప్రమాదం లో గాయపడిన చిన్నారి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. ఆఘమే ఘాల మీద బాధితులకు తక్షణ సాయం కోసం సిబ్బం దిని ఆదేశించారు. వారిని ఆస్పత్రికి తరలించే వరకు అక్కడే ఉన్నారు. హెూదాను పక్కన పెట్టి మానవత్వంతో అనితమ్మ స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అరకులోయలో కాంగ్రెస్ నేతల గృహనిర్బంధం

**అరకులోయ, జనవరి 12, మేజర్‌న్యూస్**



అత్యున్నత న్యాయస్థానాల ప్రధాన న్యాయమూర్తుల పర్యటన నేపథ్యంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులను పోలీసులు ఆదివారం గృహాల్లో నిర్బంధించారు. పర్యాటక సందర్శిత ప్రాంతాల్లో పర్యటించే న్యాయమూర్తులు జీవో నెంబర్ 3పై సమీక్ష నిర్వహించాలని, చింతపల్లి, పాడేరు, అరకు లోయ న్యాయస్థానాల్లో శాశ్వత న్యాయమూ ర్తులను నియమించి పెండింగ్‌లో ఉన్న పలురకాల కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక ప్రకటనను విడుదల చేయడంతో ఆ నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ముందస్తు చర్యలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆదివాసి నేతలు పాచిపెంట చిన్నస్వామి, తెలగంజి సోమేశ్వరరావు, శెట్టి భగత్ రామ్‌లను గృహనిర్బంధం చేశారు.ప్రధాన న్యాయమూర్తుల పర్యటన అనంతరం కాంగ్రెస్ నాయకులను పోలీసులు వదిలిపెట్టి వారికి స్వేచ్ఛ వాతావరణం కల్పించారు. ఇది ఇలా ఉండగా.. సుప్రీం కోర్టు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పర్యటన సందర్భంగా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వీలుగా ప్రధాన రహదారుల కిరువైపులా ఉన్న చిల్లర దుకాణాలను తాత్కాలికంగా తొలగించారు. అరకులోయ మండల కేంద్రంలో, ఘాట్ రోడ్డు కిరువైపులలో గల దుకాణాల్లో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు వ్యాపార లావాదేవీలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంది. సుంకరమెట్ట వారపు సంత సందర్భంగా ప్రధాన రోడ్లలో దుకాణాలు పెట్టవద్దంటూ ముందుగానే పోలీసులు సమాచారం ఇవ్వడంతో వ్యాపారులు దుకాణాలు పెట్టకుండా సహకరించారు. ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో పోలీసుల బందోబస్తు మధ్య దేశ సుప్రీంకోర్టు చీప్ జస్టిస్ సంజీవ్ ఖన్నా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ లతో పాటు మరికొంత మంది న్యాయమూర్తులు పర్యటించారు.

ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడంతో మొట్టమొదటిసారిగా గిరిజన ప్రాంతాన్ని ముఖ్య న్యాయమూర్తులు సందర్శించారు. విశాఖపట్నం నుంచి కిరండోలు ప్యాసింజర్ రైలులో అరకు లోయకు చేరుకున్న ప్రధాన న్యాయమూర్తుల బృందం గిరిజన సంస్కృతి మ్యూజియం, గంజాయిగుడ గిరి గ్రామదర్శినిలను తిలకించింది. కాగా ప్రధాన న్యాయమూర్తుల పర్యటనలో పాత్రికేయులు పాల్గొనకుండా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఆంక్షలు విధించారు. సుప్రీం కోర్టు, రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ పర్యటనకు సంబంధించిన సమాచార సేకరణకు విలేకరులకు అనుమతి లేదంటూ జిల్లా,డివిజన్ సమాచారశాఖ అధికారుల ద్వారా అరకులోయ పాత్రికేయులకు సమాచారం పంపించారు. దీంతో కలెక్టర్,ఐటిడిఏ పిఓల ఆదేశాలకు అనుగుణంగా పాత్రికేయులు వ్యవహరించారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, జనవరి 12, మేజర్‌న్యూస్:**

కూటమి ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం కోటబొమ్మాళి తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి రూ.36,98,774 లక్షలు చెక్కులను 15 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని గతప్రభుత్వం పేదల ఆరోగ్యం విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, వారి అభ్యున్నతికి, సంక్షేమం ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తున్నారని, వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ఎంత మొత్తంలో ఖర్చు పెట్టడానికైనా సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. పేద ప్రజల వైద్యం కోసం అందిస్తున్న మిగతా 2లో



# యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు

(మొదటి పేజీ తరువాయి)

ఎందరో మహనీయులు వివేకానందుని బోధనలు అనుసరించారని గుర్తు చేశారు. నాకు ఇనప సంకెళ్లు, ఉక్కు నరాలు కలిగిన 100 మంది యువకులను అందిస్తే భారతదేశ స్థితిని గతిని మార్చేస్తానని వివేకనందుడు ఆనాడు చెప్పాడని అలాంటి యువత ఇప్పుడు ముందుకు వచ్చి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆ వంద మందిలో మన కింజరాపు రామ్మోహన్ నాయుడు తప్పకుండా ఉంటారని ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస మండలం పూజారివారి పేటకు చెందిన మణికంత వివేకానందుని వేషంలో, శ్రీలత భరతమాత వేషంలో అలరించారు. ఈ కార్యక్రమంలో కే ఎన్ మూర్తి, జెసిఐ వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకర్, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, కమిషనర్ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ సుధీర్, సురంగి మోహన్ రావు, అరవల రవీంద్ర, శీర రమణయ్య, కూన అనిల్, తమ్మినేని ఉషారాణి, వరలక్ష్మి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాస్ నాయుడు, మాదరపు వెంకటేష్, కవ్వాడి సుశీల తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట

(మొదటి పేజీ తరువాయి)

నిధులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హత ఆధారంగానే సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని వివరించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల కుటుంబాల్లో ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో ముఖ్య మంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతుందని అన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, కోటబొమ్మాళి, నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, మాజీ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి, పార్టీ శ్రేణులకు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి అచ్చెన్నాయుడు ఎన్టీఆర్ భవన్‌లో స్వామి వివేకనందస్వామి 162వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

### -రూ. 4 కోట్లతో బీటీ రహదారి పనులకు శంకుస్థాపన

కోటబొమ్మాళి, జనవరి 12, మేజర్‌న్యూస్



పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలం కొత్తపేట గ్రామంలో రిఫీటర్ కేంద్ర వరకు రూ. 4 కోట్ల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బీటీ రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని ప్రత్యేక దృష్టి సారించి పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు అనుసందానం ఉండే విధంగా రహదారు నిర్మాణం చేపడతున్నట్లు తెలిపారు. కొత్తపేట కొండపైకి ప్రజల వెలితే వ్యూపాయింట్ లా తయారు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, వైఎస్ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్లొన్నారు.

# గ్రామ పంచాయితీలు అభ్యున్నతికి కృషిచేస్తా...

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పథకం నిధులతో నాలుగు ట్రాక్టర్లు పంపిణీ

కోటబొమ్మాళి, జనవరి 12, మేజర్‌న్యూస్

గ్రామ పంచాయితీల అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పథకం నిధులతో నూతనంగా నాలుగు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. టెక్కలి మండలం రావివలస, కోటబొమ్మాళి మండలం, నిమ్మాడ, తిలారు గ్రామం పంచాయితీలకు మంజూరు చేశారు, ఈ మేరకు మంత్రి వహనాలను ప్రారంభించి గ్రామాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరు చేశామని అన్నారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు సౌకర్యాలు కల్పించనున్నామని అన్నారు. కింజరాపు హరివరప్రసాద్, తెదేపా నాయకులు వెలమల కామేశ్వరరావు, బోయిన రమేష్, బగాది శేషు, తర్ర రామకృష్ణ, పాల్గొన్నారు.

### సంక్రాంతిని పురస్కరించుకొని..

# నిరుపేదలకు 'చారిటీ బాక్సు' సాయం

### - బియ్యంతో పాటు 15 రకాల వస్తువులు

విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్



సంక్రాంతిని పురస్కరించుకొని 'చారిటీ బాక్సు' ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిరుపేదలకు నిత్యావసరాలు అందజేశారు. విశాఖపట్నం సిటీ, యలమంచిలి, పాయకరావుపేట, శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట, చాపర, బాపట్ల జిల్లాలోని మార్టూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలిలో ఈ వితరణ చేపట్టారు. విశాఖపట్నం సిటీలో ప్రధానంగా పాత పోస్టాఫీసు దగ్గర నివాసం ఉంటున్న పేదలకు, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, తాటిచెట్లపాలెం, శివాజీపాలెం తదితర ప్రాంతాలలో ఎంపిక చేసిన నిరాశ్రయులకు నిత్యావసరాలు అందజేశారు. ఒక్కో కిట్లో 15 రకాల వస్తువులు, 15 కేజీల సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధి పొట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా పండుగ మూడు రోజులు అందరూ సంతోషంగా గడుపుతారని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అత్యంత దయనీయంగా జీవనం గడుపుతున్న కుటుంబాలను ఎంపిక చేసి ఈ నిత్యావసరాలు అందజేశామన్నారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధులు తాడికొండ కరుణాకర్, కొంతం శివాజీ ప్రసాద్ మాట్లాడుతూ చారిటీ బాక్సు ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు నిరుపేదల పక్షానే నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో చారిటీ బాక్సు తరుపున సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అమలాపురంలో కొప్పుల భాస్కరరావు ఆధ్వర్యంలో నెలలో రెండు సార్లు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలోని నిరుపేద విద్యార్థి చదువు బాధ్యతను చారిటీ బాక్సు తీసుకుందన్నారు. అందులో భాగంగా రెండు సంవత్సరాల కాలేజీ ఫీజు 72 వేలు చెల్లించామన్నారు. ప్రకాశం జిల్లాలోని ఓ దివ్యాంగుడికి 30 వేలు విలువ చేసే ఎయిర్ ఫిల్లింగ్ మిషన్ అందజేశామన్నారు. ఇటీవల రెండు కుటుంబాలకు కుట్టు మిషన్లు ఇచ్చామన్నారు. ఇంకా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

# సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయం

### జీవీఎంసీ జోన్-2 ఇంచార్జ్ కమిషనర్ ఫణి రామ్ -ఘనంగా ఎస్సిఆర్డబ్ల్యుఏ మధురవాడ యూనిట్ సభ్యులకు డైరీలు, స్వీట్స్ పంపిణీ



మధురవాడ, జనవరి 12, మేజర్‌న్యూస్

సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమని జీవీఎంసీ జోన్ 2 ఇన్చార్జ్ కమిషనర్ ఫణి రామ్ కొనియాడారు. మధురవాడ లోని మా మీడియా హబ్‌లో ఆదివారం ఉదయం స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర -2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జర్నలిస్టుల సేవలు మరువలేనివని అన్నారు. విపత్కర సమయాల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సమాజ స్థితిగతులపై ప్రజలను చైతన్య పరుస్తున్నది జర్నలిస్టులే అని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అద్వితీయమని ప్రశంసించారు. భవిష్యత్‌లో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చేయబోయే కార్యక్రమాలకు తమ సహకారాలు అందిస్తామని అన్నారు. స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ 2016వ సంవత్సరం నుండి జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తమ అసోసియేషన్ కృషి చేస్తుందని అన్నారు. ఓ వైపు సమాజ సేవ చేస్తూనే మరోవైపు దాతల సహకారంతో జర్నలిస్టులకు సంక్షేమం అందిస్తూ ఎస్సిఆర్డబ్ల్యుఏ జర్నలిస్టుల ప్రశంసలను పొందుతుందని అన్నారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా 7 యూనిట్స్ ద్వారా జర్నలిస్టులకు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.సీనియర్ పాత్రికేయులు పిల్లా విజయ కుమార్, సాంబశివరావు, నాగోతి నరసింహనాయుడు, ఆనంద్, రామునాయుడు తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా 2016 నుండి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న బంగారు అశోక్ కుమార్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.. సుమారు 400 మంది జర్నలిస్టులకు సంక్షేమం అందించడం చిన్న విషయం కాదన్నారు. భవిష్యత్తులో అసోసియేషన్ పేరిట మరిన్ని కార్యక్రమాలు చేసి సభ్యులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. జోనల్ ఇంచార్జ్ కమిషనర్ ఫణి రామ్ చేతుల మీదుగా జర్నలిస్టులకు డైరీలు స్వీట్స్ పంపిణీ చేశారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు కర్రి సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీలు బాలు పాత్రో, కొండ్రి వినోద్ సీనియర్ పాత్రికేయులు విజయ్ కుమార్, నేమాల అనేష్ కుమార్ , రాణా ప్రతాప్, కే అభిరామ్, మొజ్జాడ శ్రీను, మానం శ్రీనివాస్, రాము, శ్రీనివాస్, బాపూజీ, హరినాథ్, అబ్బిరెడ్డి చంద్రశేఖర్, సురేష్ కుమార్,బాబురావు,సాయి,సత్యం,సంతోష్,కుమార్,రమణ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సాగిన దక్షిణ నియోజకవర్గం ముగ్గుల పోటీలు



విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్

దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం టౌన్ కొత్త రోడ్ వద్ద మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులను మహిళలు వేశారు. విజేతలకు పోలీస్ కమిషనర్ శంఖబ్రాతబాగ్చితో పాటు ఆర్డీవో శ్రీ లేఖ తదితరులు పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకరణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల్లో ఉన్న సమర్థత, నైపుణ్యానికి గొప్ప నిదర్శనమని, మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, మహిళ అత్యంత శక్తివంతులని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ నియోజకవర్గంలో భారీ ఎత్తున ముగ్గులు పోటీలు నిర్వహించిన ఎమ్మెల్యే వంశీకి ధన్యవాదాలు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లు, కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.



# పాడి పరిశ్రమ అభివృద్దే లక్ష్యంగా గోకులాల నిర్మాణం

### పాడి, పంటల అభివృద్ధే దేశాభివృద్ధి :శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి



జలుమూరు, జనవరి 12 మేజర్‌న్యూస్

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం జలుమూరు మండలం, చల్లవానిపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 2,30000లతో నిర్మించిన మిని గోకులం షెడ్‌ను శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

గత ప్రభుత్వ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు. గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. పాడి రైతులు అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 90 శాతం సబ్సిటీ తో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులు సహకరించి తద్వారా పశువుల పెంపకం అభివృద్దితో దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పశు సంవర్ధక శాఖ, జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఔత్సాహిక రైతులకు, పశువుల పెంపకం దారులకు నిరుద్యోగులకు ప్రోత్సాహంగా ప్రభుత్వము అనేక రుణాలు అందజేస్తుందన్నారు. వీటిని ప్రతీ ఒక్క పశువుల పెంపకం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను అంది పుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు, మండల అధికారులు,కూటమి నాయకులు, కార్యకర్తలు ఇతర ప్రజాప్రతినిధులు మరియు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో టీడీపి సభ్యత్వంకి అనూహ్య స్పందన

### సారవకోట మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ..




సారవకోట జనవరి 12 మేజర్‌న్యూస్

సారవకోట మండలం గొర్రిబంధ పంచాయతీ క్లస్టర్ 7 పరిధిలో బురుజువాడ బీసీ/ఎస్టీ కాలనీ మరియు జగ్గయ్యపేట గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి అనూహ్యస్పందన లభిస్తుందని సారవకోట మండల టిడిపి అధ్యక్షుడు కత్తి'రి వెంకటరమణ తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు తంగి మురళి మోహన్ సహకారంతో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్వయంగా మండల టీడీపి అధ్యక్షులు, క్లస్టర్ 6 ఇంచార్జి కత్తి'రి వెంకటరమణ స్వయంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ సభ్యత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సమస్యలు ప్రజలు తెలియజేయగా అక్కడక్కడే అధికారులుతో మాట్లాడి సమస్యలు పరిష్కరించటం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా కత్తి'రి వెంకటరమణ మాట్లాడుతూ ప్రజలు, టిడిపి కార్యకర్తలు తెలుగుదేశంపార్టీ సభ్యత్వం పొందడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. టిడిపి సభ్యత్వం తీసుకోవడం సమాజంలో ఒక గౌరవం, గుర్తింపుగా మారిందన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇచ్చిన రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగుదేశం పార్టీ అన్నారు.

కేవలం రూ100 సభ్యత్వంతో రూ.5 లక్షల భీమా సౌకర్యం కల్పించేలా టిడిపి సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. టిడిపి సభ్యత్వం తీసుకోవడంతో పేద, బడుగు, బలహీన, వర్గాల ప్రజలందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని అందులో భాగంగా పల్లె పండగ కార్యక్రమంలో మారుమూల గ్రామలకు స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కోట్లలో నిధులు మంజూరు చేసి రహదారి పనులు చరవేగంగా జరుగున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు తంగి మురళీకృష్ణ, బైరి గోవిందరావు, తర్ర నాగయ్య, టి.సుందరరావు, బలగ.భాస్కర్, తంగి గణపతి, మెండ పాపారావు, తర్ర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీని సందర్శించిన 42 మంది ట్రైనీ ఐ.ఎ.ఎస్ అధికారులు

### జీవీఎంసీ అభివృద్ధి పనులను, ప్రాజెక్టులను వివరించిన అధికారులు -జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి

విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థను 42 మంది ట్రైనీ ఐ.ఎ.ఎస్ అధికారులు ఆదివారం సందర్శించారని, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ యొక్క అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల పనితీరు, ఇతర వివరాలను జీవీఎంసీ ఉన్నతాధికారులు వారికి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో వివరించడం జరిగిందని జీవీఎంసీ ఆదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా ట్రైనీ ఐ.ఎ.ఎస్ అధికారులు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరం, మేయర్, కమిషనర్ ఛాంబర్ లను సందర్శించారన్నారు, అనంతరం జీవీఎంసీ సమావేశ మందిరంలో ట్రైనీ ఐ.ఎ.ఎస్ అధికారులు, జీవీఎంసీ ఉన్నతాధికారులతో జీవీఎంసీ



చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను, ప్రాజెక్టుల పనితీరు తదితర వివరణల కొరకు సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో 620 స్క్వేర్ కిలోమీటర్లు కలిగిన విశాఖ నగరంలో 8 జోన్లలో, 98 వార్డులలో, 13,904 మంది జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు 24 లక్షల నగర ప్రజలకు నిత్యం సేవలందించడం జరుగుచున్నదని వివరించడం జరిగిందన్నారు. నగరంలో 3087 కిలోమీటర్ల రోడ్లు, వాటి నిర్వహణ, ఇంజనీరింగ్ పనులు, టెండర్ ప్రక్రియ విధానం, 15వ ఆర్థిక సంఘం నిధులు, చేపడుతున్న అభివృద్ధి పనులు, థీమ్ పార్కులు, రోడ్లు జంక్షన్ల అభివృద్ధి, నగరంలో విద్యుత్ ఆదాకు జీవీఎంసీ చేపట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టుల వివరాలు, ప్రజలకు నిత్యం కల్పిస్తున్న 400 మంచినీటి సరఫరా, వాటి వివరాలు, నీటి శుద్ధి కర్మాగారాలు, శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించడం, వాటి వివరాలు, జీవీఎంసీకి చేకూరుతున్న ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు, ఇతర చార్జీల వివరాలు, నగరంలో గల గృహాలు వాణిజ్య సముదాయాల నుండి నిత్యం సేకరిస్తున్న వ్యర్థాలు, వాటి పునరుత్పాదన, వేస్ట్ టు ఎనర్జీ కర్మాగారం ద్వారా విద్యుత్తు తయారీ, సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు,నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధం ప్రజలు ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించేలా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, నగరంలో భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, వర్టికల్ బిల్డింగుల నిర్మాణాలకు ఆన్లైన్ ద్వారా మంజూరు చేస్తున్న ప్లాన్ల వివరాలు, స్వచ్ఛ సర్వేక్షన్‌లో పరిశుభ్ర నగరంగా విశాఖ నగరానికి లభిస్తున్న సింగిల్ డిజిట్ ర్యాంక్‌లు, సాధించిన అవార్డులు, నగర పచ్చదనాన్ని పెంపొందించేందుకు మిద్దితోటల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించేటప్పుడు ముందస్తుగా జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు తదితర వివరాలను ట్రైనీ ఐఎఎస్ అధికారులకు జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్ ,పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్.రవి, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఎస్ ఆర్ యు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస రాజమణి క్షుణ్ణంగా వివరించారని అదనపు కమిషనర్ తెలిపారు. అనంతరం విఎమ్ ఆర్ డి ఏ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలనువి ఎమ్ ఆర్ డి ఏ జాయింట్ కమిషనర్ రమేష్ కుమార్ ఆదేశాల మేరకు శ్రీనివాస్ రాజమణి వారికి వివరించారన్నారు. అనంతరం ఖాళీ స్థలాల పన్నుల విధింపు, మంచినీటి సరఫరా తదితర వివరాలపై పలు సందేహాలను వ్యక్తం చేసిన ట్రైనీ ఐఎస్ అధికారులకు సంబంధిత అధికారులు వివరాలను తెలియపరచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆనంద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు, ఎస్ఆర్‌యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'అమేయ'కు నేషనల్ యూత్ ఐకాన్-2025' అవార్డ్

### గిరిజన వ్యవహారాల మంత్రి చేతుల మీదుగా న్యూఢల్లీలో స్వీకరణ -విశాఖకు మరో గౌరవం అన్న ప్రముఖులు




విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్

వివేకానంద జయంతి సందర్భంగా న్యూఢల్లీలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవాలు ఆది వారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడు కల్లో భాగంగా విశాఖకు చెందిన 16ఏళ్ల అమేయ లగుడు 'నేషనల్ యూత్ ఐకాన్-2025' అవార్డు అందుకుంది. శాస్త్రీయ నృత్య కళాకారిణిగా కూచి పూడి, భరతనాట్యం నృత్య రూపాల్లో ఆమె ప్రతిభను చాటుతూ, భారతీయ కళా సంప్రదా యాన్ని మనదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా సుమారు వందకు పైగా ప్రదర్శనలిచ్చిన ఆమె ఇప్పటి వరకు 8అంతర్జాతీయ, 9జాతీయ, 18 రాష్ట్ర స్థాయి అవార్డుల్ని గెల్చుకున్న విషయం తెలిసిందే. గిన్నిస్ వరల్డ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 10 ప్రపంచ రికార్డుల్ని కూడా సృష్టించింది. ఏపీ నుంచి భారతీయ కళా రంగంలో ప్రతిష్టాత్మక ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-2021 అవార్డును కేవలం 12ఏళ్ల వయస్సులోనే ఆమె అందుకుంది. న్యూఢల్లీలోని కాన్సిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా, డిప్యూటీ స్పీకర్ హాల్‌లో జరిగిన జాతీయ యువజనోత్సవాల్లో వ్యాపారం, సామాజిక సేవ, క్రీడలు, విద్య, ఆరోగ్యం, వినోదం తదితర రంగాల్లో ప్రతిభ కనబర్చిన 30మంది యువతకు ఈ అవార్డులు దక్కాయి.

### గిరిజన వ్యవహారాల మంత్రి చేతుల మీదుగా...

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరమ్ చేతుల మీదుగా అమేయ ఈ పురస్కారాన్ని స్వీకరించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి మిస్టర్ ఫ్రాన్సిస్కో ఫెర్నాండెజ్ (త్మెమూర్ లెస్టె రాయబార కార్యాలయం), ఎంపీ మనీష్ తివారీ, హైటెక్ గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతల్ని బంగారు ఫలకం, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమానికి హైటెక్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ స్పాన్సర్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే.

# తిరుమల తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా అందజేత

విశాఖపట్నం, జనవరి 12, మేజర్‌న్యూస్

వైకుంఠ ఏకాదశి టికెట్ల జారీ సందర్భంగా తిరుపతి తొక్కిసలాట ఘటన మృతుల కుటుంబాలకు టీటీడీ అందించిన ఎక్స్ గ్రేషియా చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ దుర్ఘటనలో విశాఖ నగరానికి చెందిన ముగ్గురు మహిళలు, నర్సీపట్నానికి చెందిన ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబాలకు మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు, టీటీడీ సభ్యులు రూ.25లక్షల చొప్పున పరిహారం చెక్కులను అందజేశారు. తొలుత నగరంలోని తాటిచెట్లపాలెంలో మృతురాలు శాంతి కుటుంబసభ్యులకు టీటీడీ తరపున 25 లక్షల రూపాయలు, బోర్డు సభ్యుల తరపున రూ. 2.5 లక్షల చెక్కులను హెూం మంత్రి అనిత పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్రాజు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, టీటీడీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. భావోద్వేగంతో కూడిన వాతావరణంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చనిపోయిన తమవారిని తలుచుకుని బాధిత కుటుంబాల సభ్యులు కన్నీరు పెట్టుకోగా.. వారిని హెూంమంత్రి అనిత ఓదార్చారు. మంత్రి అనిత మాట్లాడుతూ బాధిత కుటుంబసభ్యులకు అండగా ఉంటామని చెప్పారు. పోయిన ప్రాణాలు తీసుకురాలేం కానీ.. కుటుంబాలను ఆదుకుంటామన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం, వారి పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు వివరాలను సేకరించామని తెలిపారు. బాధిత కుటుంబాలు తమ సమస్యలను ప్రస్తావించగా.. సీఎంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

# పౌరసరఫరాల అధికారుల అండదండలతో రేషన్ బియ్యం పక్కదారి

### -డీఎస్‌ఓ, సర్కిల్ 3 ఎ ఎస్ ఓ కనుసన్నలోనే రేషన్ బియ్యం అమ్మకాలు -ఎండియూ ఆపరేటర్ ను కాపాడుతున్న సర్కిల్ 3 ఏఎస్‌ఓ - బియ్యం లేవు డబ్బులు ఇస్తాము ఎండిఓ ఆపరేటర్

గాజువాక, మేజర్ న్యూస్

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ మాఫియా ను అరికట్టాలని చూస్తుంటే విశాఖ జిల్లా పౌరసరఫరాల అధికారులు మాత్రం రేషన్ బియ్యాన్ని పేదలకు అందకుండా బియ్యం పక్కదారి పట్టే విధంగా చేస్తున్నారు. గాజువాక సర్కిల్ 3 పౌరసరఫరాల అధికారి అండదండలతో పాత వడ్లపూడి ప్రాంతంలో ఎండియు ఆపరేటర్ (ఏపీ 39 టి ఆర్ 9247) ప్రజలు కి రైస్ లేదు అయిపోయిందని చెప్పి డబ్బులు మాత్రమే ఇస్తున్నాడు. ఎండియు వాహనం ఒకరి పేరు మీద ఉన్నప్పటికీ బినామీ ఎండియూ ఆపరేటర్ వాహనాన్ని ఉపయోగిస్తూ రేషన్ బియ్యం ప్రజలకు అందజేయడం గమనార్హం . ఎండియూ ఆపరేటర్ రేషన్ బియ్యాన్ని ద్విచక్ర వాహనదారులకు 50 కేజీలు లు బ్యాగులతో పంపిస్తున్నాడు. ఈ విషయం అంతా జిల్లా పౌరసరఫరాల అధికారి (డి.ఎస్.ఓ), సర్కిల్ 3 ఏఎస్ఓ కు తెలిసినప్పటికీ ఎండిఓ ఆపరేటర్ ఇస్తున్న మామూలు మత్తులో చూసి చూడలేనట్టుగా వ్యవసరిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యాన్ని తరలించడానికి చూసిన ప్రజలు ఎండియూ ఆపరేటర్ను ప్రశ్నించగా నాకు నచ్చినట్టు చేస్తాను మీరు ఎవరు అడగడానికి, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని సమాధానం చెప్పడంతో అధికారుల అండదండలు ఎండియు ఆపరేటర్కు ఎంత పుష్కలంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. ప్రతి నెల ఇదేవిధంగా జరగడంతో ప్రజలు గతంలో పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు ఇచ్చినప్పటికీ అధికారులు వచ్చి చూసి చూడలేనట్టుగా వెళ్ళిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న అధికారులు, ఎండియూ ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.